కల్యాణం.. కమనీయం

- వైభవంగా మల్లన్న కల్యాణం


అగ్ని గుండాన్ని దాటుతున్న భక్తులు


కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు

కామారెడ్డి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావు, సంగమేశ్వర్ ఆధ్వర్యంలో భక్తుల జయజయధ్వానాల మధ్య ఉదయం 11:45 గంటలకు మల్లన్న, గొల్లకేతమ్మ, మేడాలమ్మల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మల్లన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు దక్షయజ్ఞం నిర్వహించారు. సుమారు 100 మంది భక్తులు అగ్ని గుండాల్లో నడిచారు. గుడిమెట్‌కు చెందిన మహాదేవ్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మల్లన్నకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్కంటి స్వామి మహిజ, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజుపాటిల్ రేవతి, కౌన్సిలర్ ఉరుదొండ వనిత రవికుమార్, గూడెల్లి గంగారాం నిర్మల సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి కట్న కానుకలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వీడీసీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

నేడు బోనాల ఊరేగింపు, ఎడ్ల బండ్ల ప్రదర్శన

మల్లన్న జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం సమర్పణ, సాయంత్రం 4 గంటలకు ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుందని వీడీసీ ప్రతినిధులు తెలిపారు. అలాగే రాత్రి సిద్దిపేటకు చెందిన దివ్యశ్రీ కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నవచైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

మల్లన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మంగళవారం పాల్గొననున్నారని వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజుపాటిల్, కోశాధికారి గూడెల్లి గంగారాం, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, వంగ రాహుల్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోలీస్ కృష్ణాజీరావు, కాసర్ల గోదావరి స్వామి, కాసర్ల రవీందర్, నిట్టు వెంకట్‌రావు, నిట్టు నారాయణరావు, నీలం సుధాకర్, కాసర్ల రాజలింగం, నాగల్ల స్వామి, లద్దూరి కృష్ణాయాదవ్, నిట్టు ప్రభాకర్, ఎంద్రియాల బాలయ్య, కుర్ర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ విఠల్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెక్‌డ్యాం నిర్మాణానికి మండలంలోని కాటేపల్లి గ్రామ శివారులో సర్పంచ్ బోధనం విఠల్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ కామారెడ్డి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.రాజు మాట్లాడుతూ.. చెక్ డ్యాం నిర్మిస్తే 40 మంది రైతులకు చెందిన సుమారు 100 ఎకరాలకు సాగు నీరందుతుందని తెలిపారు. పశువులకు, వన్య ప్రాణులకు తాగునీటి వసతి ఏర్పడుతుందన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా కాటేపల్లి గ్రామస్తులకు స్వచ్ఛంద సేవలు అందిస్తామన్నారు. ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువులు, కూరగాయలు, పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పేదల ఆర్థిక స్థితిని మెరుగుపర్చేందుకు కుట్లు, అల్లికల శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతినెలా రిలయన్స్ ప్రతినిధి ముకుందర్ రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ కామారెడ్డి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ వీరేశం, ఆర్ఎఫ్ ప్రతినిధి ముకుందర్, పాలకేంద్రం ప్రతినిధి షేక్‌చాంద్ పాషా, రైతులు మల్లప్పపటేల్, మొగులాగైడ్, చౌటకురి శంకర్, బుగుడాల హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రహరీ నిర్మాణంపై ఆందోళన

- డిపో మేనేజర్ ఇందిరతో దోమకొండ గ్రామస్తుల వాగ్వాదం


డీఎం ఇందిరతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

దోమకొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ చేపట్టిన ప్రహరీ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్తులు డీఎం ఇందిరతో సోమవారం వాగ్వాదానికి దిగారు. స్థానిక బస్టాండ్ ప్రాంతం నుంచి ఎదురుగా ఉన్న దేవేందర్‌రావు ఆస్పత్రివైపు పెద్దమ్మ కాలనీవాసులు కొన్నేళ్లుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు మొదలుపెట్టగా తమకు రోడ్డు వదలి ప్రహరీ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఆర్టీసీ డీఎం ఇందిర వచ్చిన విషయం తెలుసుకున్న కాలనీవాసులతోపాటు జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యతో పాటు స్థానిక నాయకుడు నల్లపు శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. 40 ఫీట్లతో కాలనీకి రోడ్డు వెళ్లేలా దారిని వదిలి నిర్మాణం చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, పెద్దమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పున్న లక్ష్మణ్, శివరాంమందిర్ ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్, ఆర్టీసీ అధికారులు తదితరులున్నారు.

క్లుప్తంగా

ఆటో జేఏసీ ఇన్‌చార్జీల ఎన్నిక



కామారెడ్డి అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికుల సమస్యలు, ఇతర పెండింగ్ సమస్యలపై ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి ఇన్‌చార్జీలను ఎన్నుకున్నట్లు ఆటో కార్మిక సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు తెలిపారు. సోమవారం స్థానిక చర్చిమైదానంలో నిర్వహించిన సమావేశంలో కామారెడ్డి పట్టణ జేఏసీ ఇన్‌చార్జీలుగా ఎస్కే హైమద్, షిండే సాయిరాం ఎన్నికయ్యారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు డి.రమేశ్, పి.నర్సింలు, పి.హరిదాస్, లక్ష్మీనారాయణ, సంతోష్, చందు, గడ్డం నవీన్, ఎస్కే హనీఫ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి తహసీల్దార్‌గా జనార్దన్



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండల తహసీల్దార్‌గా బి.జనార్దన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు ఇక్కడ పనిచేసిన జే.వెంకటరావును బదిలీ చేయగా, రెవెన్యూ అధికారి లత ఇన్‌చార్జీగా వ్యవహరించారు. బీర్కూర్ తహసీల్దార్‌గా ఉన్న జనార్దన్‌ను కామారెడ్డికి పూర్తి బాధ్యతలతో తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

షబ్బీర్‌అలీకి అభినందన



భిక్కనూరు: కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమితులైన మహ్మద్ అలీ షబ్బీర్‌కు భాగిరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సోమవారం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి నర్సాగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు పెంటాల తిరుపతిగౌడ్ నాయకులు భిక్షపతిగౌడ్, తిరుపతిరెడ్డి హైదరాబాద్‌కు వెళ్లి షబ్బీర్ అలీని కలిసి సన్మానించారు.

ఏఎంసీ చైర్మన్‌కు పరామర్శ



భిక్కనూరు: మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లూరి హన్మంత్‌రెడ్డిని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. గతనెల 21వ తేదీన హన్మంత్‌రెడ్డికి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న గంప గోవర్ధన్ హైదరాబాద్‌లో ఉంటున్న హన్మంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు నర్సింగ్‌రావు ఉన్నారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

భిక్కనూర్/రామారెడ్డి: హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నర్సింలుయాదవ్, జాయింట్ సెక్రటరీ గీరెడ్డి మహేందర్‌రెడ్డి కోరారు. రామారెడ్డి, భిక్కనూర్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, తెలంగాణ సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు భూమన్నయాదవ్ హాజరవుతారని తెలిపారు. సర్పంచుల సమస్యలపై చర్చించి సీఎంతో పాటు పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విన్నవిస్తామన్నారు. కామారెడ్డి జిల్లా సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్కూల్‌లో స్వయంపాలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి ఉన్నతపాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పీఈటీలు, అటెండర్లుగా 10వతరగతి విద్యార్థులు వ్యవహరించారు. ఎచ్ఎంగా సంతోష్ అనే విద్యార్థి వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అశ్విని శ్రీవాస్తవ


దేవాయిపల్లిలో క్యాలెండర్ల ఆవిష్కరణ..

లింగంపేట(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సోమవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. లింగంపేట మండలం ఎల్లమ్మతండాలో నిర్వహించిన కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ న్యూ ఢిల్లీకి చెందిన అశ్విని శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ సంకల్పమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతినెలా 80కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందిస్తున్నదని, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నదన్నారు. ఆయుష్మాన్‌భారత్, రాజీవ్‌ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్ సుధీర్ మాట్లాడుతూ.. ఉచితంగా జన్‌ధన్ బ్యాంకు ఖాతా తీసుకున్న వారు రూ.50 వేల వరకు లావాదేవీలు జరపవచ్చన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకరచారి, సర్పంచ్ భీంరావు, ఆరోగ్య మిత్ర అనిల్‌కుమార్, నోడల్ అధికారి రాము, కార్యదర్శి మమత, శ్రీనివాస్, గోవింద్, రంజిత్‌కుమార్, రాకేశ్, అంగన్‌వాడి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేవాయిపల్లి, తక్కడ్‌పల్లిలో..

తాడ్వాయి/పెద్దకొడప్‌గల్: తాడ్వాయి మండలం దేవాయిపల్లి, పెద్దకొడప్‌గల్ మండలం తక్కడ్‌పల్లి గ్రామాల ప్రజలకు కేంద్ర పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. దేవాయిపల్లి గ్రామ పెద్దలు, ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రవీందర్‌రావు, లింగారావు, వెంకట్‌రావు, బ్యాంకు సిబ్బంది, పోస్టల్, ఆరోగ్య అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఆదివారం నాటికి లక్షా 66వేల 52టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



ఎల్లారెడ్డి : పట్టణంలో రూ.9కోట్ల వ్యయంతో చేపడుతున్న వంద పడకల ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారులు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు అధికారులు సూచించారు. వారివెంట న్యాక్ ఈఈ జైపాల్, ఏఈ కుమార్ తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో దేవీసింగ్

పిట్లం(జుక్కల్): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈవో దేవీసింగ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యల సంతోష్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, 317 జీవో కారణంగా సర్వీస్ నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలని, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేవిధంగా తగు చర్యలను తీసుకోవాలన్నారు. నాయకులు హనుమనారాయణ, సీమ భాస్కర్, గిరిజ, సెవంత బాయి, స్రవంతి, కమల, స్వరూప పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారిణికి సన్మానం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మంగ సురేఖను ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. సురేఖ ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైంది. సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు బీఆర్ఎస్ నాయకుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం


మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభిస్తున్న ఎంఈవో వెంకటేశం

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): మండలంలోని కళ్యాణి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో వెంకటేశం సోమవారం పునఃప్రారంభించారు. గత కొద్దిరోజులుగా మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోవడంతో అధికారులు కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనపథకాన్ని పునఃప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

కామారెడ్డి అర్బన్: మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెత్త పేరుకుపోతున్నదని పట్టణంలోని 34వ వార్డువాసులు మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మురికికాలువలను శుభ్రం చేయడం లేదని, చెత్తను ఎత్తడం లేదన్నారు. మధురానగర్ వివేకా వర్ధిని పాఠశాల వద్ద నెలరోజుల క్రితం తీసిన మురికికాలువల మట్టిని ఎత్తడం లేదని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ ముత్తగారి శిరీష్‌గౌడ్ తన అనుచరులతో కలిసి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీబలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

విగ్రహావిష్కరణ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలో బొమ్మగొండేశ్వర మహరాజ్ విగ్రహాన్ని స్థానిక నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కుర్మ సంఘం ఆధ్వర్యంలో బొమ్మగొండేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రారంభోత్సవం సందర్భంగా కుర్మసంఘం నాయకులు అన్నదానం చేశారు. నీలుపేటల్, శివానంద్, రాములుసేట్, భానుగౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, రోడ్డుకిరువైపులా ఊడ్చడమే కాకుండా, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామపెద్దలు, యువకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఎంపీటీసీ రాజమణి, అధ్యాపకులు సంతోష్, శ్రీనివాస్, శ్రీకాంత్, సతీశ్, గ్రామపెద్దలు బాలయ్య, రవీందర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం



మద్నూర్(జుక్కల్): ఫిజియోథెరపీతో అంగవైకల్యాన్ని నయంచేయొచ్చని ఫిజియోథెరపిస్ట్ విశాలక్ష్మి అన్నారు. అంగవైకల్యం ఉన్న పిల్లలకు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా విశాలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లలు పుట్టిననాటినుంచి వైకల్యం ఉన్నప్పటికీ ఫిజియోథెరపీ ద్వారా మామూలుస్థితికి తీసుకురావొచ్చని, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దన్నారు. తాము సూచించే పద్ధతిలో ఇంటి వద్ద ప్రతిరోజూ పిల్లలతో చేయిస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. డోంగ్లీ, మద్నూర్ రెండు మండలాల్లో రెండు వందల మందికిపైగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీచర్ భాగ్యలక్ష్మి, రాణి, విద్యార్థులు వారితల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లపై భారీ తగ్గింపు ప్రకటించిన నేపథ్యంలో వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చలాన్లు చెల్లించాలని రామారెడ్డి ఎస్సై సుధాకర్ సూచించారు. గంగమ్మవాగు వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహనదారులతో పెండింగ్ చలాన్లు కట్టించారు. గతేడాది డిసెంబర్ 25వ తేదీలోపు తమ ఉన్న చలాన్లకు తగ్గింపు వర్తిస్తుందన్నారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై అబీద్‌బేగ్ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. సిబ్బంది ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన విద్యార్థులు


ఆస్పత్రి ఆవరణలో సౌత్ క్యాంపస్ విద్యార్థులు

కామారెడ్డి టౌన్: అబ్జర్వేషనల్ విజిట్‌లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. ఐసీటీసీ, ఏఆర్టీ, ఎస్టీడీ, బ్లడ్‌బ్యాంక్ తదితర విభాగాలను పరిశీలించిన విద్యార్థులకు ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలను వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్, ఐసీటీఎస్ కౌన్సిలర్ నాగరాజు, సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని రామేశ్వరపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్లలో రెండు నెలలుగా నివసిస్తున్న తాము నీటివసతి, కరెంట్, సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు సోమవారం కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. మొత్తం 130 కుటుంబాలున్నాయని, ఎలాంటి ప్రాథమిక సౌకర్యాలు లేవని లబ్ధిదారులు వాపోయారు. కరెంట్ మీటర్లు బిగించాలని, నీటి వసతి కల్పించాలని, అలాగే సిమెంట్‌రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా కరెంట్ మీటర్లు బిగిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని లబ్ధిదారులు తెలిపారు.


పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్‌లో అక్షింతల పంపిణీ..


భిక్కనూరు మండలం జంగంపల్లిలో..


నాగిరెడ్డిపేటలో..

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

సాక్షి నెట్‌వర్క్ : అయోధ్య శ్రీరాములవారి అక్షింతలతో శోభాయాత్ర, ఇంటింటికీ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. అక్షింతల కలశంతో వాడవాడల్లో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో కృష్ణానంద స్వామి పూజలు నిర్వహించారు.


నర్వ గ్రామంలో శోభాయాత్ర..


భిక్కనూరులో ..